క్లుప్తంగా

1 నుంచి దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ

నందవరం : వచ్చే నెల జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా పేదల నిత్యవసర సరుకులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..మొబైల్(ఎండీయూ) వాహనాల ద్వారా ఇప్పటి వరకు ఇంటింటికి రేషన్ పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేసిందన్నారు. ఇక నుంచి రేషన్ కార్డు లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు వెళ్లి రేషన్ తీసుకోవాలని సూచించారు. జూన్ 1వ తేదీ నుంచి రోజు రేషన్ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు డీలర్లు రేషన్ సరుకులు పంపిణీ చేస్తారని వివరించారు. 65 ఏళ్ల పైబడిన వారికి, విభిన్న ప్రతిభావంతులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలన్నారు. నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇంటి స్థలాలు ఇచ్చేంత వరకు పోరాటం

ఆదోని రూరల్: కూటమి ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేంతవరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తూనే ఉంటామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు, పట్టణ, మండల కార్యదర్శి సుదర్శన్, కల్లుబావి రాజు, పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేసి పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూన్ 2వ తేదీన స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. ధర్నాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కమిటీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, శివరాములు, ఏపీ రైతు సంఘం నాయకులు ఎల్లప్ప, కొత్తూరు గంగన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వద్దు



సోమప్ప సర్కిల్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వహించక ఆయా పనులను సక్రమంగా చేపట్టాలని సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్, పార్క్ రోడ్, ట్యాంక్ బండ్ రోడ్, కమిటీ రోడ్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. వర్షాలు కురుస్తున్నందున పట్టణంలో ఎక్కడ కూడా అపరిశుభ్రత వుండకుండా పారిశుధ్య పనులు చేయించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుకు సూచించారు.

ఏపీఆర్‌జేసీలో మెరిసిన విద్యార్థులు





అఫ్రీన్, మహేష్,సాయి జశ్వంత్ కుమార్

కోసిగి: మండలం నుంచి ఏపీఆర్‌జేసీ ఎంట్రన్స్‌లో ముగ్గురు విద్యార్థులు ఉత్తమ మార్కులతో ప్రతిభ కనపరిచారు. మండలంలోని దుద్ది గ్రామానికి చెందిన షబ్బీర్, గౌసియా దంపతుల కుమార్తె అఫ్రీన్ 555 మార్కులు, ఈశ్వరయ్య, పద్మ దంపతుల కుమారుడు కె.మహేష్ 485 మార్కులు సాధించారు. అలాగే కోసిగికి చెందిన శిలివేరి పెద్ద ఈరన్న, సుమిత్ర దంపతుల కుమారుడు సాయి జశ్వంత్ కుమార్ మౌంట్ కార్మెల్ స్కూల్‌లో చదివి 10వ తరగతిలో 559 మార్కులు సాధించాడు. ఇందులో అఫ్రీన్, సాయి జశ్వంత్ కుమార్‌లు అనంతపురం జిల్లా కొడిగెనహళ్లిలో సీటు పొందారు. కె. మహేష్‌కు అన్నమయ్య జిల్లా వయనాడ్‌లో సీటు దక్కింది.

30న మున్సిపల్ సమావేశం

ఎమ్మిగనూరుటౌన్:ఈనెల 30వ తేదీన ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు బుధవారం తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

హుండీ కానుకల లెక్కింపు

హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1.20 లక్షలు వచ్చినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తిమ్మయ్య, రాజశేఖర్‌గౌడ్, మల్లికార్జున, నర్సానాయక్ బుధవారం తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి గట్టు దర్శనానికి వచ్చిన భక్తులు హుండీలో వేసిన కానుకలను బుధవారం నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాలకు చెందిన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీలో దాదాపు 2 నెలలకు సంబంధించి కానుకలున్నట్లు చెప్పారు. హొళగుంద ఎస్ఐ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఈ సొమ్మును ఆలయ అభివృద్ధి పనులకు వాడనున్నట్లు సభ్యులు వెల్లడించారు.

సాగుకు సన్నద్ధం.. అందని సాయం

- అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వం
- ఖరీఫ్‌లో అప్పు చేయక తప్పని పరిస్థితి
- వైఎస్సార్‌సీపీ హయంలో మే నెలలోనే రైతు భరోసా

గోనెగండ్ల : ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురుస్తుండడంతో రైతులు వేసవి దుక్కులు చేసుకొని ఖరీఫ్ సీజన్ సేద్యానికి సిద్ధం అవుతున్నారు. ఈ సమయంలో పెట్టుబడులకు రైతు చేతిలో చిల్లిగవ్వ లేక అప్పులు చేసేందుకు దారులు వెతుకుతున్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు అందజేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి.. అధికారం చేపట్టి దాదాపు 11 నెలలు దాటినా అమలుకు చర్యలు తీసుకోలేదు. దీంతో అన్నదాతలకు అప్పులు తప్పడం లేదు. ఇదే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందేదని గుర్తు చేసుకుంటున్నారు.

14వేల మంది ఎదురు చూపు..

గోనెగండ్ల మండలంలో 14వేల మంది రైతులు ఉన్నారు. ప్రతి ఏటా వేరుశనగ, పత్తి, ఉల్లి, సజ్జలు, కొర్ర తదితర పంటలు ఖరీఫ్ సీజన్‌లో 42,170 ఎకరాల్లో సాగు చేస్తారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఆర్భాటంగా హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నెలబెట్టు కోవడానికి నేటికీ తడబడుతూనే ఉంది. రైతులకు అండగా ఉంటామని ఏ కష్టం రాకుండా ముందస్తు చర్యలు చేపట్టడమే కాకుండా అన్న దాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు అందిస్తామని ఎన్నికల ముందు ప్రకటించారు. అధికారం చేపట్టి దాదాపు 11 నెలలు దాటింది. ఇప్పటి వరకు రైతు సంబంధిత సంక్షేమం అంటూ ఏమీ లేదు. కేంద్ర ప్రభుత్వ కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతుకు అందే నిధులు మినహాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా జమ కావడం లేదు.



వ్యవసాయానికి పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

నిధులు విడుదలయ్యేదెన్నడో?

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు ఏటా అందిస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇంత వరకు పైసా కూడా ఇవ్వలేదు. రైతుల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుండటంతో ప్రస్తుతం గ్రామాల్లో ఈ పథకాలను సంబంధించిన వివరాల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ లబ్ధి పొందేందుకు సమీప రైతు సేవా కేంద్రాలకు రావాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేదెన్నడో అర్హులను గుర్తించి నిధులు విడుదల చేసేదెప్పుడో అర్థం కాక రైతులు తలలు పట్టుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే మార్గదర్శకాలను అనుసరించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసేది. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులతో పాటు పెట్టుబడి సాయం అందించే వారు. కేంద్రం ఇచ్చే రూ.6 వేలకు రాష్ట్ర ప్రభుత్వం వాటా కలిపి (రైతు భరోసా) కింద మొత్తం రూ.18,500 అందించేది. ఈ మొత్తం ఖరీఫ్ ప్రారంభానికి ముందుగా మే నెలలో నేరుగా రైతు ఖాతాకు జమ చేసేవారు. వీటితో పాటు వైఎస్సార్ పంటల బీమా, పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇలా ప్రతి దశలో అన్నదాతలకు వైఎస్ జగన్ ప్రభుత్వం అందించేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

సాయం అందించాలి



వాతావరణంలో ప్రతికూల పరిస్థితుల వలన మండలంలో మోస్తరు వర్షాలు కురిశాయి. దీంతో పొలాల్లో దుక్కులు దున్నడం మొదలుపెట్టారు. రబీ సీజన్‌లో వేసిన పంటలు నష్టాన్ని మిగిల్చాయి. ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతోంది. వేసివి దుక్కులకు డబ్బులు లేక రైతులం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సుఖీభవ నగదును వెంటనే జమ చేయాలి.

– వెంకట్రామి రెడ్డి, అలువాల గ్రామం

ఎప్పుడు ఇస్తారో?



ఖరీఫ్ సీజన్‌లో పంట సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే చాలా చోట్ల పొలాలను దుక్కి దున్నుతున్నారు. పెట్టుబడులు లేక బయట అప్పులు చేస్తున్నాం. గ్రామాల్లో పథకాలకు సంబంధించి అధికారులు వివరాలు తీసుకుంటున్నారు. అయితే ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే అన్నదాత సుఖీభవ రైతులకు జమ చేస్తే బాగుంటుంది.

– తోలు రాముడు, గంజిహళ్లి గ్రామం

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ యాజమాన్యం ఏకపక్షంగా 2500 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం శోచనీయమన్నారు. వర్క్‌టెండర్లు రెన్యూవల్ చేయకుండా మరో 1500 మంది కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. అదేవిధంగా 1200 మంది రెగ్యులర్ కార్మికులను బలవంతంగా వీఆర్ఎస్ పేరుతో తొలగించడం జరిగిందన్నారు. ఇలా కార్మికులను పలు కారణాలు పేర్కొంటూ విధులను నుంచి తొలగించడం వెనుక కుట్ర జరుగుతోందన్నారు. ఉద్యోగ భద్రతకై 12వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు సమ్మెకు దిగడానికి కారణం యాజమాన్యమే అని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నరసింహారెడ్డి, విజయేంద్ర, దాదావలి, శివ, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల వర్ధంతి సభలను జయప్రదం చేయండి

ఆదోని అర్బన్: అమరవీరుల వర్ధంతి సభలను జయప్రదం చేయాలని బీడీఎస్‌యూ రాష్ట్ర కన్వీనర్, సభ అధ్యక్షులు పగడాల రమేష్, పగడాల కోదండ, ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ దళిత బహుజన శ్రామిక విముక్తి జాతీయ కార్యదర్శి దస్తగిరినాయుడు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కార్యాలయంలో కామ్రేడ్ మారోజు వీరన్న 26వ వర్ధంతి సభను నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ అమర వీరుల వర్ధంతి సభలను నిర్వహిస్తామని, సభలకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

రుణాల మంజూరులో ఇబ్బందులు లేకుండా చూడాలి

ఆదోని రూరల్: రైతులకు పంట రుణాల మంజూరులో అవరోధాలు కలుగకుండా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఆవరణలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్‌లు, వ్యవసాయశాఖ అధికారులు, బ్యాంకింగ్ రంగ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న అర్హులైన రైతులకు వెంటనే రుణం మంజూరు చేయాలన్నారు. రుణాలు మంజూరు చేయడంలో ఆలస్యం జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆదోని, ఎమ్మిగనూరు వ్యవసాయశాఖ అధికారులు బాలవర్ధిరాజు, ఏడీఏ ఖాద్రి, ఆదోని కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ రాజేష్ రాజుమోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఆదోని టౌన్: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి అన్నారు. బుధవారం పట్టణంలో యోగాంధ్రలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యోగాంధ్ర కార్యక్రమం ద్వారా ప్రజలకు యోగా చేయడం వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

కౌతాళం: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక చర్చిలో ఎంపీడీఓ విజయశేఖర్, ఈఓఆర్‌డీ ప్రకాశం ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగ కార్యక్రమాన్ని చేపట్టారు. చర్చి ఫాదర్‌తో పాటు విద్యార్థులు అధికారులు యోగా చేశారు.

గోనెగండ్ల : యోగాంధ్ర ప్రచారంలో భాగంగా ఎంపీడీఓ మణి మంజరి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యోగా మాస్టర్స్ పర్యవేక్షణలో ఈఓఆర్డీ అనంతసేన, ఏపీఎం హేమలత, ఎంఈఓలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధిహామీ సిబ్బంది, వైద్య సిబ్బంది యోగా చేశారు.



ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, అధికారులు

పోషకాహార కిట్ల పంపిణీ

పెద్దకడబూరు: మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామ పరిధిలోని క్షయవ్యాధి బాధితులకు ఆస్పత్రి సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుస్మిత, టీబీ సూపర్‌వైజర్(ఎంపీహెచ్ఎస్) బాబురాజు, సూపర్‌వైజర్లు కిశోర్, భాస్కర్, శ్రీధర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సహకారంతో నిరుపేద రోగులకు ఈ పోషకాహారాన్ని అందించాలన్న ఉద్దేశంతో 6నెలల పాటు పోషకాహారాన్ని అందించాలనే నిర్ణయాన్ని తీసుకున్నామన్నారు. రోగులు 6 నెలల పాటు మందులు వేసుకోవడంతో పాటు పౌష్టికాహారాన్ని తీసుకుంటే రోగాన్ని తరిమికొట్టొచ్చునన్నారు. అదేవిధంగా ప్రధానమంత్రి టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పేద క్షయవ్యాధి గ్రస్తులను దత్తత తీసుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



రోగులకు పోషకాహార కిట్లును పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇంజినీరింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మోకాళ్లపై కూర్చొని భిక్షాటన చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లు

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కార్మిక విభాగం నాయకులు రాజేంద్రకుమార్ డిమాండ్ చేశారు. తమ సమస్యల సాధనకు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడానికి నిరసనగా బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలు దేరి సోమప్ప సర్కిల్‌లో మోకాళ్లపై కూర్చొని భిక్షాటన చేశారు. ఆర్టీసీ బస్సులు, ఆటోలో వెళ్లే ప్రయాణికులు, పాదచారుల వద్ద బిక్షమెత్తుకుంటూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

పోలీసు శాఖకు బారికేడ్ల వితరణ

ఎమ్మిగనూరురూరల్: పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్లకు భారతి సిమెంట్ కంపెనీ 20 బారికేడ్లను వితరణ చేసింది. బుధవారం పట్టణంలోని శ్రీ సాయిరాఘవేంద్ర ట్రేడర్స్ ఆధ్వర్యంలో భారతి సిమెంట్ కంపెనీ రాయలసీమ డిప్యూటీ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, టెక్నికల్ మేనేజర్ ఓబులరెడ్డి, కరణం దేవేంద్రరెడ్డిలు టౌన్ సీఐ వి.శ్రీనివాసులు, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులకు బారికేడ్లను అందజేశారు. టౌన్ సీఐ వి. శ్రీనివాసులు మాట్లాడుతూ భారతి సిమెంట్ కంపెనీ వారు ఇచ్చిన బారికేడ్లు ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగపడతాయని చెప్పారు. కంపెనీ రాయలసీమ మేనేజర్ మల్లారెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా భారతి సిమెంట్ తరుపున రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏదో ఒక రూపంలో సేవా కార్యాక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కంపెనీ కర్నూలు జిల్లా మేనేజర్ ఇక్బాల్, టెక్నికల్ ఆఫీసర్ ఉదయ్‌కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టణ పోలీస్‌స్టేషన్‌కు బారికేడ్లను అందజేస్తున్న భారతి సిమెంట్ కంపెనీ ప్రతినిధులు, టౌన్ సీఐ శ్రీనివాసులు

ఆర్డీటీకి సహకారం అందిస్తాం

మంత్రాలయం/కోసిగి: పేదల కోసం ఆర్డీటీ సంస్థ చేస్తున్న సేవలకు తమ వంతు సహాయ సహకాలు అందిస్తామని, ఎప్పుడూ సంస్థకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. బుధవారం ఆర్డీటీ సంస్థ ఏడీ సరస్వతి నేతృత్వంలో సంస్థ లబ్ధిదారులు రాంపురంలో ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డిను కలిసి సేవలపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ పేదల కోసం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఎంతో మంది పేదలకు నివాస గృహాలు నిర్మించడం, తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లు నెలకొల్పడం, పిల్లల విద్య కోసం ఆసరాగా నిలవడం వంటి సేవలందిస్తోందన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో ఆ సంస్థ చేస్తున్న పనులకు తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంస్థ ఏటీఎల్ క్రిష్ణయ్య, ఇతర సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



ఆర్డీటీ సభ్యులు, లబ్ధిదారులతో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న బుక్కిటి వీరేష్ కుమారుడు వివాహ వేడుకలకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి హాజరయ్యారు. నూతన దంపతులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టనగౌడ, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం తాలూకా అధ్యక్షుడు నాడుగేని నాగరాజు, జిల్లా ఐటీ విభాగం కార్యదర్శి జగదీష్ స్వామి, మహాంతేష్ స్వామి, మహిళ విభాగం మండల నాయకురాలు దళవాయి మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ కమ్యూనిటీ భవనం ప్రారంభం

మండల పరిధిలోని కామన్‌దొడ్డి గ్రామంలో ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ భవనాన్ని ఆ సంస్థ రీజినల్ డైరెక్టర్ సరస్వతి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి ప్రారంభించారు. గ్రామ నాయకుడు నరసింహుల గౌడ, సిబ్బంది పాల్గొన్నారు.

నంబాల ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలి


ఎమ్మిగనూరుటౌన్: మావోయిస్ట్ అగ్రనేత నంబాల కేశవరావుతో పాటు మరికొందరు మావోయిస్టలను ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్ట్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవేంద్ర, నాయకులు వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా నాయకుడు పంపణ్ణ గౌడ్, సీపీఎం నాయకుడు రాముడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి రంగన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కగార్ ఆపరేషన్ ప్రారంభమైనప్పటి నుంచి కేంద్రప్రభుత్వం 500ల మందిని పొట్టన పెట్టుకుందని ఆరోపించారు. మావోయిస్ట్ పార్టీ నాయకులు పలు మార్లు శాంతియుత చర్చలకు సిద్ధమైనప్పటికీ కేంద్రప్రభుత్వం ఏకపక్షంగా నరమేధం కొనసాగిస్తోందన్నారు. మావోయిస్ట్ అగ్రనేతతో పాటు మరికొందరని చంపి ఎదురు కాల్పుల్లో చనిపోయారని చెప్పడం శోచనీయమన్నారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు రాజు, ఏసేబు, బతకన్న, భాస్కర్ యాదవ్, తిమ్మగురుడు, విజయేంద్ర, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

బురద మయంగా రోడ్లు



పంపాపతిస్వామి దేవాలయం వద్ద ఇలా..

నందవరం : మండల కేంద్రంలోని పంపాపతి స్వామి ఆలయం వీధి, వీరశైవ లింగాయతి కాలనీ, తెలుగు మెయిన్ స్కూల్ పక్కన రోడ్లు చిన్నపాటి వర్షం కురిస్తే బురద మయంగా మారుతున్నాయి. ఆయా కాలనీ వాసులు, రైతులు ఇళ్లలో నుంచి బయటకు అడుగు పెట్టాలంటే ఇబ్బందులు పడాల్సివస్తోంది. రోజుల తరబడి రోడ్లపై వర్షపు నీరు, మురుగు నీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. అధికారులు స్పందించి ఆయా కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



తెలుగు మెయిన్ స్కూల్ పక్కన రోడ్డు దుస్థితి

పెద్దపార్క్‌ను అభివృద్ధి చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రజలకు సేదతీర్చుతూ పిల్లలకు ఆటవస్తువులతో ఆటవిడుపునిచ్చే పట్టణంలోని పెద్ద పార్క్‌ను అభివృద్ధి చేయాలని వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి మాచాని వెంకటేష్, పార్టీ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహులు, నాయకులు పాలశ్రీనివాస రెడ్డి, వెంకటాపురం రాజు కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘుకు వినతి పత్రం ఇచ్చి మాట్లాడారు. పెద్ద పార్క్‌లో యువత కోసం ఏర్పాటు చేసిన వ్యాయామ వస్తువులు విరిగిపోయాయని, అదేవిధంగా ఆట వస్తువులు పూర్తిగా ధ్వంసం అయ్యాయని తెలిపారు. పార్క్‌లో వాకింగ్ ట్రాక్, మంచినీటి సౌకర్యం, మరుగు దొడ్లు లేవని వాటిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ఆయా సమస్యలపై స్పందించిన చైర్మన్ పార్క్ అభివృద్ధికై ఆయా అంశాలను మున్సిపల్ సమావేశపు అజెండాలో చేర్చి, పనులు చేపట్టేందుకు అధికారులను ఆదేశిస్తామని తెలిపారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇసుక రీచ్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

హొళగుంద: మండలంలోని మార్లమడికి మజరా గ్రామమైన ముద్దటమాగిలో బుధవారం వేదావతి (హగరి) నదిలో ఇసుక రీచ్ నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో భాగంగా గ్రామసభ జరిగింది. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మైనింగ్ డీడీ(గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్) రవిచంద్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిశోర్‌రెడ్డి, హొళగుంద తహసీల్దారు నిజాముద్దీన్ పాల్గొన్నారు. నది పరిధిలోని 127 సర్వే నంబరులో 7.814 హెక్టార్ల విస్తీర్ణంలో 78,140 క్యూబిక్ మీటర్ ఇసుక తవ్వకాలు సాగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు అధికారులు గ్రామసభలో వివరించారు.

వాహనాల బహిరంగ వేలం



వాహనాలకు వేలం నిర్వహిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి.రామకృష్ణ

కోసిగి: కోసిగి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన 45 వాహనాలకు జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి.రామకృష్ణ ఆధ్వర్యంలో సీఐ భార్గవ్ రెడ్డి నేతృత్వంలో బహిరంగ వేలం నిర్వహించారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు బహిరంగ వేలం నిర్వహించారు.ఇందులో 45 వాహనాలకు రూ.4,19, 490 ఆదాయం సమకూరినట్లు సీఐ చెప్పారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నిర్ణయించిన ధరకు అదనంగా 58.83శాతం అధికంగా వచ్చినట్లు తెలిపారు.



పట్టుబడిన మద్యం ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

పట్టుబడిన మద్యం ధ్వంసం

పెద్దకడబూరు, కోసిగి మండలాల పరిధిలో పట్టుబడిన అక్రమ మద్యాన్ని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి. రామకృష్ణ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. బుధవారం 31 కేసులలో పట్టుబడిన 320 లీటర్ల అక్రమ మద్యాన్ని స్థానిక మార్కెట్ యార్డులో ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. వాటి విలువ రూ.1,45,200 ఉంటుందని సీఐ తెలిపారు. ఎస్ఐలు కార్తీక్ సాగర్, కె.నాగేంద్ర, హెడ్ కానిస్టేబుల్ కిశోర్ కుమార్, కానిస్టేబుల్ మునిరంగడు, భరత్, రవి పాల్గొన్నారు.